క్లుప్తంగా

పల్లెల్లో వీధిలైట్లు వేయకుంటే ఎలా?

–జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: గ్రామాల్లో కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలని, కనీసం వీధిలైట్లు కూడా వేయకుంటే ఎలా? అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై ఎంపీడీఓ భాస్కర్, సిబ్బందిని ఆరా తీశారు. చాలా గ్రామాల్లో చిన్నపాటి మరమ్మతులు, వీధి దీపాలను కూడా వేయడం లేదనే ఫిర్యాదులు సర్పంచుల నుంచి తమకు వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

ఈఓకు వీడ్కోలు సన్మానం



శివశంకర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది

వి.కోట: స్థానిక మేజర్ పంచాయతీ ఈఓ శివశంకర్ రాళ్లబూదుగురు గ్రామ పంచాయతీకి బదిలీ కావడంతో గురువారం ఆయనకు పంచాయతీ సిబ్బంది వీడ్కోలు సన్మానం చేశారు. సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఆయన స్థానంలో రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ నుంచి శ్రీనాథ్‌రెడ్డి ఈఓగా ఇక్కడికి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కుమార్‌రాజా, బిల్ కలెక్టర్ సాదిక్, పృథ్వి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది రా..!



అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల గురించి మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నజ్మా

పలమనేరు: మున్సిపాలిటీలోని లింగాయత్ వీధి, లక్ష్మణ్‌సింగ్ వీధుల్లో ×అంగన్‌వాడీ పిలుస్తోంది రా× కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా నిర్వహించారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీల్లోనూ ఇంగ్లిష్ మీడియం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ వార్డు పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



సరస్వతి

రొంపిచెర్ల: అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వాలని పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనంగా టీచర్లకు రూ.21 వేలు, ఆయాలకు రూ.18 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇంత వరకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రేషన్ కార్డులను కూడా తొలగిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పని భారం కూడా ఎక్కువ అవుతుందన్నారు. అంగన్‌వాడీలను విస్మరించడం ప్రభుత్వానికి తగదన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి నిర్వహిస్తున్న అంత్యక్రియలు

కుప్పం రూరల్: ఈ నెల 8న ఆదివారం దిబ్రూనగర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి దాతలు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కుప్పం రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని నాలుగు రోజుల పాటు కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఉంచారు. ఎవరూ అతని కోసం రాకపోవడంతో డీకే పల్లెకు చెందిన మణి సహకారంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ రమేష్, శివ పాల్గొన్నారు.

అందని యూనిఫామ్, షూలు..!

- బడులు తెరుచుకున్నా పూర్తిస్థాయిలో పంపిణీ నిల్
- యూనిఫామ్ వచ్చేదెప్పుడు..వాటిని కుట్టి పంపిణీ చేసేదెన్నడో..?
- పాఠశాలల విలీనం, టీచర్ల బదిలీలతో మరింత జాప్యం కావొచ్చనే అనుమానాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో స్కూళ్ల ప్రారంభానికి ముందే విద్యాసామగ్రి పంపిణీ



పలమనేరులోని ఓ బడిలో షూలు లేని పిల్లలు

పలమనేరు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో స్కూళ్ల ప్రారంభానికి ముందే 'జగనన్న విద్యాకానుక' పేరిట విద్యాసామగ్రి పంపిణీ పూర్తయ్యేది. ప్రస్తుత కూటమి పాలనలో దీనికి పేరు మార్చడం విదితమే. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లు ఇంకా పూర్తి స్థాయిలో పిల్లలకు అందలేదు. ముఖ్యంగా యూనిఫాం, షూలు మండలాలకు చేరనేలేదు. యూనిఫామ్ ఈనెల 20లోపు వస్తుందని ఎంఈఓలు చెబుతున్నారు. అవి వచ్చేదెప్పుడు? వాటికి కుట్టి పిల్లలు పంపిణీ ఎప్పుడనేది తెలియడం లేదు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో బడులు తెరుచుకోగానే జగనన్న విద్యాకానుక పేరిట ఏడు రకాల విద్యాసామగ్రి పిల్లలకు అందడం విదితమే. వీటిల్లో యూనిఫామ్స్, షూలు మరికొన్ని ఇంకా అందలేదు. మరోవైపు పలు పాఠశాలలను ఇతర పాఠశాలల్లో విలీనం చేస్తున్నారు. అంతేకాకుండా మండలంతోపాటు జిల్లాలోనూ టీచర్ల బదిలీల ప్రక్రియ సాగుతోంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో కిట్ల పంపిణీ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బడులు తెవరకముందే అందిన విద్యాసామగ్రి(ఫైల్)



కూటమిలో విద్యార్థిమిత్ర కిట్ల పోస్టర్

పలమనేరు మండలంలో కిట్ల పంపిణీ ఇలా...

మొత్తం ప్రాథమిక పాఠశాలలు	: 58
మొత్తం విద్యార్థులు	: 3,175
ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు	: 11
వీటిలో మొత్తం విద్యార్థులు	: 3,998
మొత్తం కలిపి విద్యార్థుల సంఖ్య	: 7173
పిల్లలకు వచ్చిన మొత్తం బ్యాగులు	: 7170
బెల్టులు(బాలురకు)	: 4,907
షూలు, సాక్సులు	: 12,966
యూనిఫాం	: 7,170
నోట్ పుస్తకాలు	: 46,105
అచ్చు పుస్తకాలు	: 63,834
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు (ఆరో తరగతి వారికి)	: 1376

20లోపు అన్నీ అందుతాయి



మండలంలోని బడులకు సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యార్థిమిత్ర కిట్స్ ఇప్పటికే అందాయి. మిగిలిన యూనిఫామ్స్, షూలు 20వ తేదీ లోపు రానున్నాయి. ఆపై వీటిని పంపిణీ చేస్తాం. ఇంతకు ముందు వచ్చిన విద్యాసామగ్రిని ఆయా బడులకు పంపిణీ చేశాం.

--లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

నోటీస్ బోర్డు

14, 15న ప్రత్యేక పూజలు, హోమాలు

● **పెద్దపంజాణి:** మండలంలోని సూరకుంట్లలోని ప్రసిద్ధి చెందిన మునీశ్వరస్వామి కొండపై విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, మునీశ్వరస్వామి వారికి 14, 15వ తేదీలలోప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా శనివారం కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, మూల మంత్ర హోమం, గణపతి హోమం, నవగ్రహ హోమం, ఆదివారం ప్రాణ ప్రతిష్ఠ, ప్రాయశ్చిత్త హోమం, విగ్రహ సంప్రోక్షణ ఇత్యాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అలాగే రోజూ అన్నదానం, కోలాటలు, చెక్క భజనల కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

నేడు సింగిరిగుంటలో కల్యాణోత్సవం

● **చౌడేపల్లె:** మండలంలో సింగిరిగుంటలోని శ్రీ విజయ వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం సిద్ధి బుద్ధి సమేత శ్రీ విజయ వినాయక స్వామికి మహా రుద్రాభిషేకం, హోమ పూజలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం పుష్ప పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తామన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం కృష్ణారెడ్డి మృతి



కృష్ణారెడ్డి (ఫైల్)

సదుం: మండలంలోని జాండ్రపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లపరెడ్డిగారి కృష్ణారెడ్డి (78) గురువారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతిలో చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జాండ్రపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

యూనిఫాం లేదు..పుస్తకాలు మాత్రమే పంపిణీ..!

- సన్నబియ్యం వండితే ముద్ద కట్టింది!



చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, షూస్ లేకుండా కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ కేశవరెడ్డి, టీచర్లు

చౌడేపల్లె: పాఠశాలల పునఃప్రారంభం తొలిరోజు పాడ్యమిని సెంటిమెంట్‌గా భావించిన తల్లిదండ్రులు సగానిపైగా ప్రతి పాఠశాలలకు తమ పిల్లలను పంపలేదు. మండల వ్యాప్తంగా యూనిఫాం, షూస్, లేకుండా వచ్చిన అరకొర పుస్తకాలతో పంపిణీ చేసి మమ అనిపించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో చేసిన భోజనం ముద్దగానే మారింది. మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల, పెద్దకొండామర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో ముద్దకట్టిన అన్నాన్ని విద్యార్థులకు వడ్డించారు. సర్పంచ్ జయసుధమ్మ చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు.చౌడేపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

యూనిఫాం, షూలు నిల్

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు. మండలంలో అన్ని స్కూళ్లకూ కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 దామోదర తెలిపారు. అయితే యూనిఫాం, షూస్ రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి, ఎస్‌ఎంసీ వైస్ చైర్‌పర్సన్ యాస్మిన్, టీచర్లు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థి మిత్ర కిట్లను గురువారం హైస్కూల్లో ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేసినట్టు ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, గోవర్ధన్, హెచ్‌ఎం లక్ష్మీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ అక్బర్ పాల్గొన్నారు.



మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాలలో ముద్ద కట్టిన భోజనాన్ని వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిచ్చిలివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉర్దూ ఉన్నత పాఠశాల, పెద్దమల్లెల, నగిరి దళితవాడ, రామచంద్రాపురం కాలనీ పాఠశాలల్లోనూ పాఠ్య పుస్తకాలు, బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సుజాత, వెంకటరమణారెడ్డి, ఎల్లప్ప, వెంకట్రామ్మయ్య,సర్పంచ్ అరుణమ్మ,స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు





సదుంలో కిట్ల పంపిణీ , పులిచర్ల: కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి



రొంపిచెర్ల: చిచ్చిలివారిపల్లెలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ

టీచర్ తప్పితే ఒక్క విద్యార్థీ రాలేదు..!



మోటుమల్లెల పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో రికార్డులు రాసుకుంటున్న ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి

రొంపిచెర్ల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. అయితే మండలంలోని మోటుమల్లెల ప్రాథమిక పాఠశాలకు తొలిరోజు ఒక్క విద్యార్థి కూడా రాలేదు. ఇక్కడ మొత్తం 13మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క విద్యార్థి కూడా హాజరు కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులను ఆరా తీయగా, పాడ్యమి నడుస్తోందని, ఇది మంచిరోజు కాదని, అందుకే తమ పిల్లలను స్కూళ్లకు పంపలేదని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి చేసేదేమీ లేక రికార్డులు రాసుకుంటూ తొలిరోజు గడిపారు.

యోగాతో మేధోశక్తి పెంపు



యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కుప్పం రూరల్: యోగాసనాల సాధనతో మేధోశక్తి పెరుగుతుందని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం నుంచి విద్యార్థులకు యోగాశిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యోగాసనాలు వేస్తే కలిగే విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను నాగరాజు వివరించారు. యువతీ యువకులు క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, కళాశాల కార్యదర్శి సాగర్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం కండి

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



హేమంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచుతోందని,రానున్న రోజుల్లో ప్రజల పక్షాన పోరాటం చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పలమనేరు మున్సిపల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మార్గదర్శనం చేశారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చామని సాక్షాత్తు సీఎం చంద్రబాబే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మొత్తం 147 హామీలిచ్చి, ఇప్పుడు అసలు పట్టించుకోకుండా మోసం చేస్తారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో శిక్షణకు తరలిన మహిళలు

కుప్పం: అలీఫ్ సంస్థ, కడా సంయుక్తంగా సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా పారిశ్రామికుల శిక్షణా తరగతులకు కుప్పం నుంచి మహిళలు తరలి వెళ్లారు. హైదరాబాద్ ప్రగతి నగర్‌లోని అలీఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు. రెండు రోజుల శిక్షణకు కుప్పం నుంచి 35 మహిళలు వెళ్లారు. కుప్పం నియోజకవర్గంలో 100 మంది మహిళలను ఎంపిక చేశారు. వారిలో మొదటి విడతగా 35 మంది గురువారం వెళ్లారు.

వైభవంగా గంగజాతర




బంగారుపాళెం: జాతరలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మ జల ప్రవేశ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. సాయంత్రం ఉట్లమాను అధిరోహించేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ జల ప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని మొగిలివెంకటగిరి దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి..పైరు వృద్ధి

- జాగ్రత్తలు పాటిస్తేనే మంచి దిగుబడులు
- వ్యవసాయాధికారుల సూచనలు





వేరుశనగ విత్తన శుద్ధి చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) వ్యవసాయాధికారి నాగరాజు

గుడుపల్లె: ఏ పంట అయినా సాగు చేయడానికి నాణ్యమైన విత్తనాలు ముఖ్యం. అలాగే మరింత శ్రద్ధ వహించి విత్తనశుద్ధి చేసి విత్తితే మంచి దిగుబడులు పొందవచ్చు. అయితే చాల మంది రైతులు ఈ విత్తన శుద్ధి గురించి పెద్దగా పట్టించుకోరు. వ్యవసాయాధికారుల సలహాలు–సూచనలు పాటించక తమకు తోచినట్లు విత్తనాలు వేసి చివరకు తీవ్రంగా నష్టపోతున్నారు. వేరుశనగ కాయలు ఇటీవల పంపిణీ చేశారు. విత్తన శుద్ధి చేసుకుని సిద్ధంగా ఉంటే వర్షాలు కురిశాక వెంటనే పొలాన్ని రెండుసార్లు దున్ని పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వివిధ ప్రాంతాలలో విత్తనాలతో నష్టం

ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో, సకాలంలో విత్తనాలు అందించకపోవడం మూలాన బయట నుంచి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తినప్పుడు శిలీంధ్రాలు, బ్యాక్టీరియా ఆశించి, మొలక శాతం తగ్గి కుళ్లి పోతుంటాయి. విత్తన శుద్ధితో ఆరోగ్యమైన నారు పంట వస్తుంది. మందులు పిచికారీ అవసరం కొంతవరకు తగ్గడంతో పాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. పైరుపై రసాయనిక ఎరువులు పిచికారీ చేయడం కంటే విత్తనశుద్ధి పాటించడం చాలా సులువు.

వేరుశనగ శుద్ధి

ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మవిరిడీ శిలీంధ్రం, ఒక ఎకరాకు సరిపడే వరి నారు పెంచడానికి విత్తన శుద్ధికి 30గ్రాముల కార్బండిజం మందు అవసరం ఉంటుంది. పైరుపై పిచికారీ చేయాలంటే 200 గ్రాముల అవసరం కావాలి. వేరుశనగ విత్తనాలను ముందుగా శుద్ధి చేసి తరువాత రైజోబియం కల్చర్ పట్టించాలి. ఇలా శుద్ధి చేసిన విత్తనాలను పశువులు తినకుండా దూరంగా ఉంచాలి. కిలో విత్తనాన్ని గ్రాము మోంకోజెట్ లేక గ్రాము కార్బిండిజం లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మాతో శుద్ధి చేస్తే కాండం తెగులు నివారించవచ్చు. వేరు పురుగు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కిలో విత్తనానికి 6.5 మి.లి క్లోరోపైరిపాస్ లేదా 2 మిల్లీ ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి . పంటలను వేసే ముందు విత్తనాలను శుద్ధి చేస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి నాగరాజు చెప్పారు.